



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 190 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 16 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :190 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 16 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు..
# కానీ కదలలేని స్థితిలో!
## భారత ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక!



- ఫిబ్రవరి 28న ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు
- సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని మృతి
- మొజ్తబాకు తీవ్ర గాయాలు అంటూ భారత ఇంటెలిజెన్స్ రిపోర్ట్!
- మొజ్తబా తరపున ఐఆర్జీసీనే పాలన సాగిస్తోందని వెల్లడి
- ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు మరింత బలం చేకూర్చేలా ఇంటెలిజెన్స్ నివేదిక!

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బ్రతికే ఉన్నప్పటికీ, తీవ్ర గాయాలతో కదలలేని (ఇమ్మొబైల్) స్థితిలో ఉన్నారని భారత ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో ఓ కథనం వెలువడింది. ఆయన సంభాషణలు, బహిరంగ ప్రకటనలన్నీ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) కట్టుదిట్టమైన నియంత్రణలో ఉన్నాయని ఆ కథనం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇరాన్ నాయకత్వంపై, దేశ స్థిరత్వంపై అంతర్జాతీయంగా తీవ్ర

- మిగతా 2లో




## విజయ్‌కి డిప్యూటీ సీఎం పోస్టు ఆఫర్..?

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలన నేపథ్యంలో రాష్ట్రంలో భాజపా, టీవీకే పార్టీల మధ్య పొత్తు విషయంలో మరోసారి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. పొత్తులో భాగంగా టీవీకే అధినేత విజయ్ కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని భాజపా ఆఫర్ చేసిందని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీవీకేతో పొత్తుకు సంబంధించి చర్చలు తుది దశకు చేరుకున్నాయని భాజపా వర్గాలు తెలిపాయి. ఆ పార్టీకి 80 సీట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు పేర్కొన్నాయి. విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆఫర్ చేసినట్లు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పదవిపై విజయ్ దృష్టి పెట్టారని.. చర్చల్లో ఈ విషయం కీలకంగా మారిందని చెప్పాయి. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకు ఇరుపార్టీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భాజపా, డీఎంకేలతో తమకు పొత్తులు ఉండవని విజయ్ గతంలోనే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినా.. వీటికి సంబంధించిన వార్తలు వస్తూనే ఉండటం గమనార్హం.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై
# చంద్రబాబు సీరియస్...
### నోటీసులు ఇవ్వాలని పల్లాకు ఆదేశం!

- మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా అరెస్ట్
- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశం
- వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని పల్లాకు సూచన
- ఇలాంటివి ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం



**పెన్ పవర్ డెస్క్:**మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్న ఆయన, పార్టీ కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలని పుట్టా మహేశ్‌ను ఆదేశించారు. ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు.. పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, డ్రగ్స్ కేసులో పుట్టా పట్టుబడిన వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కూడా పల్లాను ఆదేశించారు. వ్యక్తుల బలహీనతలు, వ్యక్తిగత తప్పిదాల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉద్ఘాటించారు. ఈ ఘటనపై పార్టీపరంగా కఠిన చర్యలు ఉంటాయనే సంకేతాలను ఇచ్చారు.

## కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని
## పరామర్శించిన సీఎం చంద్రబాబు



- ఇటీవల కన్నుమూసిన కావూరి సాంబశివరావు
- హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించిన చంద్రబాబు
- ప్రజాప్రతినిధిగా కావూరి సేవలను కొనియాడిన ముఖ్యమంత్రి
- మాజీ డీజీపీ హెచ్‌జే దొర కుటుంబసభ్యులను కూడా పరామర్శించిన చంద్రబాబు
- పోలీసు శాఖకు దొర చేసిన కృషిని గుర్తు చేసుకున్న వైనం

- మిగతా 2లో



## నెతన్యాహుకు ఇరాన్
# ‘డెత్ వార్నింగ్’!

- వెంటాడి, వేటాడి చంపుతామని ఐఆర్ జీసీ హెచ్చరిక
- బాగ్దాద్ అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి
- ఖర్గ్ ఐలాండ్‌ను ధ్వంసం చేసిన అమెరికా

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా కూటమి మధ్య జరుగు తున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరు కుంది. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును ‘వేటాడి చంపుతామని’ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) శనివారం ప్రతిజ్ఞ చేశాయి. నెతన్యాహు ఆచూకీపై సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వస్తున్న తరుణంలో ఆయన ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

- మిగతా 2లో

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కు
# స్టేషన్ బెయిల్ మంజూరు



- మొయినాబాద్ ఫామ్‌హౌస్ లో డ్రగ్స్ పార్టీ
- పట్టుబడిన వారిలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్
- మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్
- మొత్తం 11 మందిపై కేసు నమోదు
- కేసు దర్యాప్తు వేగవంతం చేసిన ఈగల్ టీమ్

- మిగతా 2లో





## నాలుగు రాష్ట్రాలు మోగిన
# ఎన్నికల నగారా..

- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో, మిగిలిన చోట్ల ఒకే విడతలో పోలింగ్
- ఏప్రిల్ నెలలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి
- అన్ని ప్రాంతాల ఓట్ల లెక్కింపు మే 4వ తేదీన..

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు: సీబీఐ దర్యాప్తుపై
# సునీత తీవ్ర అసంతృప్తి



- కీలక నిందితుల ఫోన్ సంభాషణలను సీబీఐ పట్టించుకోలేదని ఆరోపణ
- జగన్, భారతిని కూడా విచారించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య
- న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేసిన సునీత

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ తీరుపై ఆయన కుమార్తె డాక్టర్ సునీత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఐ బాధ్యతాయుతంగా, లోతుగా దర్యాప్తు చేయలేదని ఆమె

- మిగతా 2లో



## బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి
### పుంగనూరులో విషాదం..

- బైక్ నుంచి వెలువడిన పొగ పీల్చి తాత, ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- మెకానిక్ సలహాతో బైక్‌ను రాత్రంతా ఆన్‌లో ఉంచిన యజమాని
- పైగదిలో నిద్రించడంతో ప్రాణాలతో బయటపడ్డ దంపతులు

- మిగతా 2లో

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు
# ఎంపీగా ఉండే అర్హత లేదు



- మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ
- పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించిన పోలీసులు
- పుట్టాను కాపాడేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నేత కాకాణి ఆరోపణ
- చంద్రబాబు బ్రాండ్ అంటే డ్రగ్స్ బ్రాండ్ అని విమర్శ
- సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని వ్యాఖ్యలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# సరదా కోసం యుద్ధం చేస్తావా?

### ఓరీ నీ ట్రంప్.. మామూలోడివి కాదు సామీ

అమెరికా రాజకీయాల్లో డొనాల్డ్ ట్రంప్ అనే పేరు ఒక 'టెలివిజన్ రియాలిటీ షో' లాంటిది. అక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. తాజాగా ఇరాన్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు అంతర్జాతీయ రాజకీయాలు అంటే ఒక 'వీడియో గేమ్' అనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపై ఇప్పటికే భారీగా దాడులు చేసి అక్కడి చాలా భాగాన్ని నాశనం చేశామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే కేవలం వినోదం కోసం కూడా మళ్లీ దాడులు చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ తమతో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ వారు పెట్టిన షరతులు సరైనవిగా లేవని ట్రంప్ విమర్శించారు. ఇదే సమయంలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఇంకా బతికే ఉన్నారా అని కూడా ఆయన ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

**ఆ 'వినోదం' ఏంటో!**

సాధారణంగా ఎవరైనా యుద్ధం గురించి మాట్లాడాలంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. కానీ ట్రంప్ గారు మాత్రం యుద్ధాన్ని ఏకంగా "ఎంటర్టైన్మెంట్" కిందకు చేర్చేశారు. "వినోదం కోసం కూడా దాడులు చేస్తాం" అని ఆయన అన్నారంటే ఆయనకు ప్రపంచ పటం ఒక 'బోర్డ్ గేమ్' అని అర్థం చేసుకోవాలి. పాపం.. యుద్ధం అంటే ఏంటో తెలిసిన వాళ్లు ఈ మాట విని షాక్ అవుతుంటే ట్రంప్ మాత్రం రిమోట్ కంట్రోల్ పట్టుకుని దాడులను టీవీలో చూస్తున్నట్టు బిల్డప్ ఇస్తున్నారు.

**సుప్రీం లీడర్ బతికే ఉన్నారా?**

ఇక ఆయన ప్రశ్నల సెన్సే ఏంటో ఎవరికీ అర్థం కాదు. "ఇరాన్ సుప్రీం లీడర్ ఇంకా బతికే ఉన్నారా?" అని అడగడం వెనుక ఏ వ్యూహం ఉందో ఆయనకే తెలియాలి. ఇది ఒక రకమైన 'మైండ్ గేమ్' అనుకోవాలా లేక తనదైన శైలిలో కవ్వించడమా? ఆయనకు ఏది సరదా? ఏది రాజకీయం? అన్నది తెలుసుకోవడం సాధారణ రాజకీయ విశ్లేషకులకు అసాధ్యం.

**యుద్ధమా? వ్యాపారమా?**

ట్రంప్ గారి దృష్టిలో అంతర్జాతీయ సంబంధాలు అంటే ఒక డీల్. ఇరాన్ ఒప్పందం గురించి మాట్లాడుతూ "మాకు నచ్చినట్లు ఉంటేనే ఓకే.. లేదంటే దాడులే" అనడం చూస్తుంటే, ఆయనకు 'ప్రపంచ శాంతి' కంటే 'పవర్' ఆడే ఆటలో గెలవడమే ముఖ్యమనిపిస్తోంది. ట్రంప్ పాత కాలం నాటి రాజకీయ నాయకులకు, ఇప్పటి టెక్నాలజీ యుగంలో సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను కలిపేసిన ఒక కొత్త 'పొలిటికల్ బ్రాండ్'. ఆయన మాటలు వింటుంటే ఎప్పుడు నవ్వాలో, ఎప్పుడు ఆందోళన చెందాలో అర్థం కాక ప్రపంచం తల పట్టుకుంటోంది. ఏదేమైనా ఆయనకు యుద్ధం అంటే సరదా కావచ్చు కానీ ఆ సరదా వల్ల ప్రపంచం పడే ఇబ్బందులే అసలైన 'ట్రాజెడీ'!

# ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు.. కానీ కదలలేని స్థితిలో!

- మొదటి పేజీ తరువాయి

ఆందోళనలకు దారితీస్తోంది. భారత ప్రభుత్వానికి చెందిన అత్యంత విశ్వసనీయ ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం... ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఇదే దాడుల్లో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు. ఆ గాయాల కారణంగా ఆయన ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్నారు. దీంతో దేశంలో అస్థిరత ఏర్పడకుండా ఉండేందుకు ఐఆర్‌జీసీ రంగంలోకి దిగింది. మొజ్తబాతో పరిమిత సంప్రదింపులు జరుపుతూ, ఆయన పేరుతో సందేశాలను, సోషల్ మీడియా పోస్టులను అత్యంత జాగ్రత్తగా రూపొందించి విడుదల చేస్తోంది. దేశంలో అంతా సవ్యంగా ఉందనే భావన కల్పించేందుకే ఐఆర్‌జీసీ ఈ చర్యలు చేపడుతోందని నివేదిక పేర్కొంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ నివేదికకు బలాన్నిస్తున్నాయి. ఖమేనీ బ్రతికే ఉన్నారని, కానీ దాడుల్లో తీవ్రంగా గాయపడి రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి తోడు, సుప్రీం లీడర్‌గా తన సొంత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా మొజ్తబా ఖమేనీ హాజరు కాలేదు. వేదికపై కేవలం ఆయన ఫోటోను మాత్రమే ప్రదర్శించడం ఆయన ఆరోగ్య పరిస్థితిపై నెలకొన్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తీవ్రంగా ఖండించారు. మొజ్తబా ఖమేనీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఇవన్నీ అమెరికా సృష్టిస్తున్న అసత్య ప్రచారాలని కొట్టిపారేశారు.

కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు, భారత ఇంటెలిజెన్స్ నివేదిక మాత్రం పరిస్థితి తీవ్రంగానే ఉందని సూచిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్‌లో నెలకొన్న ఈ నాయకత్వ సంక్షోభం పశ్చిమాసియా రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఆర్‌జీసీయే పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

# డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు

డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, "చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ ఘటనతో వైసీపీ నేతలు టీడీపీని 'డ్రగ్స్ పార్టీ'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇదే ఫామ్‌హౌస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పుట్టా మహేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి

అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ మెకానిక్ ఇచ్చిన సలహా పాటించడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బైక్ ఇంజిన్ నుంచి వెలువడిన పొగను పీల్చి తాత, ముగ్గురు మనవళ్లు మృతి చెందిన ఈ ఘటన పట్టణంలోని త్యాగరాజు వీధిలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. త్యాగరాజు వీధికి చెందిన మురళి తన ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించాడు. ఇంజిన్ సమస్య ఉండటంతో మెకానిక్, రాత్రంతా బైక్‌ను ఆన్‌లో ఉంచాలని సూచించాడు. దీంతో మురళి ఇంట్లోనే బైక్‌ను ఆన్ చేసి ఉంచి, తలుపులు మూసేశాడు. ఆ సమయంలో మురళి తండ్రి రామచంద్రయ్య, కుమారుడు కార్తీక్, కవల కుమార్తెలు చరిత, చందన కింద గదిలో నిద్రిస్తుండగా.. మురళి, అతడి భార్య రేవతి పైగదిలో పడుకున్నారు.

ఇల్లు ఇరుకుగా ఉండి, గాలి సరిగా ఆడే వీలు లేకపోవడంతో బైక్ నుంచి వెలువడిన పొగ గది మొత్తం వ్యాపించింది. ఈ పొగను పీల్చడంతో ఊపిరాడక తాత, మనవడు, మనవరాళ్లు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. పైగదిలో ఉండటంతో మురళి, రేవతి దంపతులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కళ్లముందే కన్నబిడ్డలు, తండ్రి విగతజీవులుగా పడి ఉండటంతో వారి రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# నాలుగు రాష్ట్రాలు మోగిన ఎన్నికల నగారా..

దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాం తానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.

ఎన్నికల షెడ్యూల్‌కు ముందు రాజకీయ పార్టీల నేతలతో, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు స్వీకరించామని

జ్ఞానేశ్ కుమార్ వివరించారు. ఈ ఐదు ప్రాంతాల్లో మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మే 4న జరిగే కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

# ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కు స్టేషన్ బెయిల్ మంజూరు

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. సోమవారం (మార్చి 16) పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున ఆయనకు నోటీసులు ఇచ్చి వదిలేసినట్టు తెలిసింది. ఎంపీ మహేశ్ యాదవ్‌తో పాటు మరో నిందితురాలైన ప్రియాంక రెడ్డికి కూడా స్టేషన్ బెయిల్ లభించినట్లు సమాచారం. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును ఈగల్ టీమ్ వేగవంతం చేసింది. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, వారి నుంచి కీలక వివరాలు రాబడుతున్నారు. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి, దీని వెనుక ఎవరున్నారు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నిందితులకు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, పుట్టా మహేశ్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ అని తేలినట్లు పోలీసులు తెలిపారు.

# కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయవేత్త కావూరి సాంబశివరావు కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్లిన సీఎం, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా కావూరి సాంబశివరావు దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**హెచ్.జె. దొర కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు పరామర్శ**

అలాగే, ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జె. దొర కుటుంబ సభ్యులను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లోని దొర నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్ర పోలీస్ విభాగానికి దొర చేసిన సేవలను, శాఖను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఆయన చేసిన కృషిని చంద్రబాబు ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# నెతన్యాహుకు ఇరాన్ 'డెత్ వార్నింగ్'!

- మొదటి పేజీ తరువాయి

. "అతను బతికే ఉంటే.. అతన్ని వెంబడిస్తాం, పట్టుకుంటాం, చంపేస్తాం" అంటూ టెలిగ్రామ్ ఛానల్ వేదికగా ఐఆర్ జీసీ సంచలన ప్రకటన చేసింది. యుద్ధం 16వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై మరోసారి క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్‌పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. మరోవైపు, ఇరాన్‌లోని వ్యూహాత్మక 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా జరిపిన బాంబు దాడులను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఖర్గ్ ఐలాండ్‌లోని సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశామని, అవసరమైతే మరిన్ని దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రపంచ దేశాలన్నీ హర్మూజ్ జలసంధిలో నౌకల రక్షణకు ముందుకు రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ సైన్యం కూడా వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఐదు సార్లు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మాట్లాడుతూ.. తమ దేశ చమురు క్షేత్రాలపై దాడి జరిగితే పశ్చిమాసియాలో అమెరికా వాటాలున్న ప్రతి చమురు కేంద్రాన్ని బూడిద చేస్తామని హెచ్చరించారు. ఈ యుద్ధ ప్రభావంతో బహ్రెయిన్, సౌదీ అరేబియాలో జరగాల్సిన ఫార్ములా-1 రేసింగ్‌లు కూడా రద్దయ్యాయి. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### వివేకా హత్య కేసు: సీబీఐ దర్యాప్తుపై
# సునీత తీవ్ర అసంతృప్తి

- మొదటి పేజీ తరువాయి

సంచలన ఆరోపణలు చేశారు. కడప జిల్లా పులివెందులలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కేసులో తనకు అందరూ అన్యాయం చేస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. "నిందితులు చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా దర్యాప్తు జరపలేదు. హత్యకు ముందు, తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. సాక్షిలో గుండెపోటు వార్త రావడానికి నిమిషం ముందే కిరణ్ యాదవ్ అనే వ్యక్తి అర్జున్‌రెడ్డికి మెసేజ్ పంపాడు. ఈ కీలక ఆధారాన్ని సీబీఐ ఎందుకు లోతుగా పరిశీలించలేదు?" అని ఆమె ప్రశ్నించారు. తాను కోర్టుతో పాటు సీబీఐకి కూడా అదనపు ఆధారాలు సమర్పించినప్పటికీ, వాటిపై కూడా సరైన విచారణ జరగలేదని సునీత ఆరోపించారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన అర్ధాంగి భారతిని విచారించాల్సిన అవసరం ఉందని, కానీ సీబీఐ వారిని విచారించలేదని అన్నారు. తాను ఇంతగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సునీత.. న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# నా సినిమాను దెబ్బతీయడానికే మోనాలిసా పెళ్లి.. దర్శకుడి సంచలన ఆరోపణలు



'ది డైరీ ఆఫ్ మణిపూర్' సినిమాతో తాను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్న నటి మోనాలిసా భోంస్లే వయసుపై ఫిల్మ్ మేకర్ సనోజ్ మిశ్రా సంచలన ఆరోపణలు చేశారు. ఆమె మైనర్ అని, ఆమె వయసుపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇటీవల మోనాలిసా వివాహం చేసుకోవడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ విషయంపై సనోజ్ మిశ్రా మాట్లాడుతూ.. మహాకుంభ్ సమయంలో మోనాలిసా వయసు సుమారు 16 సంవత్సరాలేనని, పెళ్లి కోసం ఆమె వయసు పత్రాలను తారుమారు చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. "మోనాలిసా అసలు వయసును నిర్ధారించేందుకు మెడికల్ పరీక్షలు జరపాలని డిమాండ్ చేసేందుకు నేను మహేశ్వర్ వెళ్లి ఆమె కుటుంబాన్ని కలుస్తాను" అని ఆయన తెలిపారు. ఈ పెళ్లి తన సినిమా ప్రాజెక్టును దెబ్బతీయడానికి పక్కా ప్రణాళికతో చేసిన కుట్ర అని సనోజ్ మిశ్రా ఆరోపించారు. మోనాలిసా తన సినిమాలో నటించకుండా ఉండేందుకే కొన్ని బృందాలు ఈ పెళ్లిని జరిపించాయని ఆయన అన్నారు. ఒకవేళ వైద్య పరీక్షల్లో మోనాలిసా మైనర్ అని తేలితే, ఆమె భర్త ఫర్మాన్‌తో పాటు ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఇతరులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కొద్ది రోజుల క్రితమే మోనాలిసా, ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తిని కేరళలో వివాహం చేసుకుంది. అయితే, జనవరిలోనే ఆమెకు 18 ఏళ్లు నిండాయని కుటుంబ సభ్యులు, పోలీసులు చెబుతున్న నేపథ్యంలో దర్శకుడి ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 10వ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు

## -ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

## -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు పెన్ పవర్ మార్చి 15**

రేపటినుంచి 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థినీ విద్యార్థులందరికీ స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. విద్యా ప్రయాణంలో ఈ పరీక్షలు కీలకమైనవి. కానీ పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావద్దు. బాగా చదివి పరీక్షలు చక్కగా రాయండి అని సూచించారు. వీలైనంతవరకు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోండి. ముఖ్యమైన హాల్ టికెట్, ప్యాడ్, పెన్ లాంటి వస్తువులు మర్చిపోకుండా తీసుకెళ్లండి. కష్టపడి చదివి, మంచి ఫలితాలు పొందేలా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులందరికీ ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం




పెన్ పవర్ EXCLUSIVE ప్రత్యేకం

# కక్కుర్తి వార్డెన్..!

- పెద్దారికట్ల సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ లో నిర్లక్ష్యం బట్టబయలు
- నలుగురు విద్యార్థులను చూపించి 45 మంది విద్యార్థుల మెనూ బొక్కేస్తున్నా వైనం
- మెనూ సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఆరోపణ
- చాలిచాలని భోజనం - అర్ధాకలితో విద్యార్థులు
- వార్డెన్ ఎప్పుడూ వస్తారో - ఎప్పుడు వెళ్తారో తెలీదంటున్న విద్యార్థులు
- వారానికి రెండు రోజులే పాలు,గుడ్డు,అరటిపండు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు
- విజిట్ చేసిన పెన్ పవర్ దినపత్రిక ప్రతినిధి
- బేరసారాలు చేసిన హాస్టల్ వార్డెన్ శ్రీనివాసరావు
- తిరస్కరించి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన పెన్ పవర్ ప్రతినిధి



విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కావలసినన్ని నిధులు విడుదల చేస్తూ విద్యాభివృద్ధికి చేయుతనిస్తుంటే కొందరు వసతి గృహాల వార్డెన్లు తప్పుడు నివేదికలిస్తూ ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తున్నారు.కొనకనమిట్ల మండలం పెద్దారికట్ల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో అవినీతి రోజు రోజుకు పెరిగిపోతుంది.లేని విద్యార్థులను ఉన్నట్లుగా చూపడం ఉన్నవారిని అధికంగా చేసి చూపడం షరా మామూలు అయింది.ఈ వసతి గృహంలో నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా 45 మంది విద్యార్థులు ఉన్నట్లు చూపిస్తూ నిధులు స్వాహా చేస్తున్నాడు ఈ వార్డెన్.కొనకనమిట్ల మండలం పెద్దారికట్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని "పెన్ పవర్" ప్రతినిధి శనివారం రాత్రి విజిట్ చేయగా పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**మార్కాపురం/కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 15 ;**

కొనకనమిట్ల మండలం పెదారికట్లలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కడుపు నిండా తిండి లేక,రాత్రులు నిద్ర లేక సతమతమవుతున్నారు.ఉడికి ఉడకని అన్నం,ఒక్క పప్పుతోనే భోజనం పెడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వసతి గృహాలను తీర్చిదిద్దుతూ విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తుంటే ఈ వసతి గృహం వార్డెన్ అక్రమ బిల్లులు పెడుతూ లక్షలు అర్జిస్తున్నట్లు తెలుస్తుంది.కొంతకాలంగా ఈ తంతు సాగుతున్న ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.ఉన్న విద్యార్థుల సంఖ్య కన్నా అధిక సంఖ్యలో విద్యార్థులను చూపిస్తూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడమే కాకుండా ఆ నిధులను స్వాహా చేస్తున్నట్టు తెలుస్తుంది.

**విద్యార్థికి ఒక నెలకు రూ:1400..**

ప్రభుత్వం వసతి గృహంలో ఉండే విద్యార్థికి ప్రతి నెలకు రూ:1400 పైననే చెల్లిస్తుంది.లెక్కల్లో తేడాలు చూపిస్తూ వార్డెన్ ప్రతిరోజు సుమారుగా 40 మందిని అధికంగా చూపిస్తూ రిపోర్టు సంక్షేమ శాఖ అధికారులకు పంపుతున్నాడు.40 మందికి ఒక నెలకు రూ:56000 అదనంగా బిల్లులు స్వాహా చేస్తున్నట్టు తెలుస్తుంది.నెలకు రూ: 56000 చొప్పున 10 నెలలకు దాదాపు రూ: 5,60,000 లక్ష రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతున్నట్టు తెలుస్తుంది.

**బేరసారాలకు దిగిన హాస్టల్ వార్డెన్..**

అక్రమ సంపాదనకు అలవాటు పడిన వసతి గృహం వార్డెన్ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా తాను ఉద్యోగంలో ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు.ఈ వసతి గృహం పైన పలువురి ఫిర్యాదు మేరకు పెన్ పవర్ దినపత్రిక ప్రతినిధి శనివారం రాత్రి వసతి గృహాన్ని సందర్శించాడు.ఆ సమయంలో నలుగురు విద్యార్థులు మాత్రమే భోజనం చేయడం గమనించి ఆ దృశ్యాలను చిత్రీకరించారు.ఈ విషయంపై వార్డెన్ శ్రీనివాసులు కు ఫోన్ చేసి వివరణ అడగా పొంతన లేని సమాధానాలు ఇస్తూ ససేమిరా అన్నాడు.అనంతరం ఆదివారం ఉదయం పెన్ పవర్ ప్రతినిధిని ఫోన్లో సంప్రదించి మీకు ఏం కావాలి అంటే అది చేస్తాను..వార్తలు రాయొద్దంటూ ప్రాధేయపడడం కొసమెరుపు.

**ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు..**

వసతి గృహంలో అనేక అవకతవకలు చేస్తూ,అవినీతికి పాల్పడుతున్న హాస్టల్ వార్డెన్ లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.నిరంతరం ఉన్నత అధికారుల పర్యవేక్షణ జరగాలని,అవినీతికి పాల్పడుతున్న అధికారులను బయటకు తీసి,వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

## బుర్రా మధుసూదన్ యాదవ్



**కందుకూరు పెన్ పవర్ మార్చి 15**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు కు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు బాగా రాయాలని కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పరీక్షల సమయంలో ఎటువంటి ఒత్తిడి, మానసిక ఆందోళన చెందకుండా దృఢ చిత్తంతో పరీక్షలను రాయాలని, మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. సంవత్సర కాలంగా మీరు చదివిన చదువులకు ఫలితం సాధించే మంచి సమయం ఆసన్నమైనదని ఎటువంటి భయము, ఆందోళన చెందకుండా ఎగ్జామ్స్ ఎదుర్కోవాలని తెలిపారు. పరీక్షల సమయంలో కావలసిన పరికరాలు ఎగ్జామ్స్ ప్యాదు, పెను, హాల్ టికెట్ పాటు సమయానికన్నా ముందుగా ఎగ్జామ్స్ సెంటర్ కు చేరుకోవాలని, ఎండ తీవ్రత వలన సరైన జాగ్రత్తలు కూడా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరగతులకు 10వ తరగతిలో సాధించే మార్కులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రశాంతంగా ఎగ్జామ్స్ రాయుటకు హడావుడి చేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎగ్జామ్స్ సెంటర్లో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను సక్రమంగా ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

## సీసీ కెమెరాలతో

# నేరాల నియంత్రణ

## -కందుకూర్ సిఐ అన్వర్ బాషా



**కందుకూరు పెన్ పవర్ మార్చి 15**

సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు నియంత్రణ చేయవచ్చునని కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశముల మేరకు కందుకూరు డిఎస్పి సూచనల మేరకు కందుకూరు సర్కిల్ సిఐ అన్వర్ బాషా పలుకూరు గ్రామం నందు సీసీ కెమెరాల ప్రాముఖ్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన కలుగు ప్రయోజనాలు వాటి వలన ఏదైనా నేరం జరిగితే సదరు నేరమును కనుగొనుటలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను దొంగతనం వంటి నేరములు చేయు వ్యక్తులు సీసీ కెమెరాలు ఉండటం వలన నేరమున చేయుటకు కూడా వెనకడుగు వేస్తారు కావున నేరములను నివారించుటలో సీసీ కెమెరాలు ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమం ప్రజలకు తెలియజేశారు. అంతే కాకుండా డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాలు వాడకం వలన కలుగు దుష్ప్రభావాలను తెలియజేసి పేకాట, కోడి పందెములు వంటివి నిర్వహించకూడదు అని తెలియజేసి ట్రాఫిక్ రూల్స్ పాటించవలసిందిగా పలుకూరు గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏ బాలకృష్ణ కందుకూర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పలుకూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

## కలెక్టర్ రాజాబాబు



**మార్కాపురం ఆర్ సి ఇంచార్జి పెన్ పవర్ మార్చి 15**

నేటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా జిల్లాలోని విద్యార్థులకు కలెక్టర్ రాజాబాబు శుభాకాంక్షలు తెలియజేశారు.సాంఘిక సంక్షేమ,బీసీ,గిరిజన మరియు ఇతర సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులకు కొన్ని ముఖ్య సూచనలు చేశారు.పరీక్షల ముందు రోజు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలని,సరైన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవడం ద్వారా అనవసరమైన ఒత్తిడిని నివారించవచ్చని తెలిపారు.పరీక్ష సమయంలో ఇచ్చే ఓఎంఆర్ షీట్‌ను జాగ్రత్తగా పరిశీలించి అందులో రూమ్ నంబర్,సబ్జెక్ట్ కోడ్,ఆన్సర్ బుక్ నంబర్లు సరిగ్గా నమోదు చేయాలని చెప్పారు.ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకున్న తర్వాతే సమాధానాలు రాయాలని సూచించారు.ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలను రాయడం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. సమాధానాలను స్పష్టంగా పాయింట్ల రూపంలో రాయాలని ప్రతి ప్రశ్నకు ఖచ్చితమైన ప్రశ్న నంబర్ వేయాలని విద్యార్థులకు సూచించారు.మరి ముఖ్యంగా సైన్స్ వంటి సబ్జెక్టుల్లో అవసరమైన చోట డయాగ్రామ్‌లు గీయడం ద్వారా మార్కులు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించాలని ఖాళీగా వదలకూడదని సూచించారు.ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను సక్రమంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రంలోనే ఉండి రాసిన సమాధానాలను మరోసారి పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.క్రమశిక్షణతో,ఏకాగ్రతతో పరీక్షలు రాసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ విద్యార్థుల విజయానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరికీ విజయవంతమైన భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# కొక్కరకో... కొండెక్కింది

## 300 దాటిన కోడి మాంసం పండుగలకు కోడి కోయలేమంటున్న మాంసం ప్రియులు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 15**

చికెన్ ఫ్రై, చికెన్ రోస్ట్, చికెన్ పకోడీ, చికెన్ మంచూరియా, ఆర్ ఆర్ చికెన్,చికెన్ కబాబ్, చికెన్ బిర్యానీ, ఇలా ఒక కోడి మాంసాన్నే వివిధ రకాల పేర్లు పెట్టి కోసి కారం మసాలా దండించి తినే మాంసం ప్రియులకు కోడి ధరల రెక్కలొచ్చి కొండెక్కివెక్కిరిస్తుంది.ప్రస్తుతం మార్కెట్లో చికెన్ ధరలు రెండింతలు పెరగడంతో,మాంసాహారుల పరిస్థితి ఆహా నా పెళ్ళంటా సినిమాలో కోట శ్రీనివాసరావులా తయ్యారయ్యింది. వేసవి కాలం రావడంతో కోళ్ల ఫారాలలోని కోళ్లు ఎండ తీవ్రతకు, వడగాల్పులకు మృత్యువాత పడుతుండటం కారణంగా చెబుతున్నారు. అయితే పెళ్లిళ్లు, తిరుణాలలు,గ్రామాలలో ఉత్సవాలు జరగడం, రంజాన్ మాసంలో చికెన్ వాడకం ఎక్కువ కావడం ధరలు పెరగడానికి మరో కారణంగా తెలుస్తుంది.నెల క్రితం కేజీ చికెన్ 200రూపాయలుంటే ప్రస్తుతం 320దాటడంతో, చికెన్ మర్చంట్ వ్యాపారులు కోడిని కోయాలంటే కత్తి వణుకుతుందని మాంసం ప్రియులు దుకాణాల వద్దకు రావడం తగ్గిందని అంటున్నారు.మటన్ ధర కూడా వెయ్యి రూపాయలకు చేరుకోవడంతో కోడి మాంసం ధర మటన్ ధరకు చేరువు అవుతుంది.ఎండ తీవ్రత మరో రెండు నెలలు పాటు ఉంటుందని దింతో చికెన్ ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

**విల విల పోతున్న వ్యాపారులు ..:** ఎప్పుడు రద్దిగా ఉండే చికెన్ మార్చంట్ వద్దకు మాంసం ప్రియులు ఎవరు రావడానికి ఇష్టపడటం లేదని,పెరిగిన కోళ్ల, పోటెల్లా ధరలతో వ్యాపారాలు తగ్గిపోవడంతో, అద్దెలు, కూలీలు చెల్లించడం కష్టతరమవుతుందని నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# బి.వి. వెంకటేశ్వర్లుకు ఘన నివాళి



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 15**

సిపిఐ సీనియర్ నాయకులు, మార్కాపురం మాజీ కౌన్సిలర్ బి.వి. వెంకటేశ్వర్లుగారి 20వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మార్కాపురంలోని పూల సుబ్బయ్య కాలనీ స్తూపం వద్ద ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన ప్రజాసేవలను స్మరించుకున్నారు. కార్మికులు, పేద ప్రజల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా బి.వి. వెంకటేశ్వర్లు గుర్తుండిపోతారని నాయకులు పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నాసరయ్య మాట్లాడుతూ వెంకటేశ్వర్లు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పనిచేసే ప్రజానాయకుడిగా పేరుపొందారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాసిం, మాజీ కౌన్సిలర్ సిఎచ్ పెద్దన్న, సిపిఐ నాయకులు గోపి, అల్లూరయ్య, దుప్పట్ల కాశయ్య, ఒబయ్య తదితరులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని బి.వి. వెంకటేశ్వర్లుగారికి ఘనంగా నివాళులు అర్పించారు.

## కదిరి బాబురావును కలిసిన హనుమంతునిపాడు మండల నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**

కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ను హనుమంతునిపాడు మండల నాయకులు ఆదివారం హైదరాబాద్ లోని కదిరి నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు మండలం లోని కొత్తూరు గ్రామం లో మార్చి 30వ తేదిన జరిగే శ్రీరామనవమి వేడుకల కు హాజరువ్వాలని కదిరి బాబురావు ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమం లో మువ్వా శివ యాదవ్, మందాటి శ్రీవాసరెడ్డి,పప్పుల శ్రీరాములు,అలవల వెంకటరెడ్డి, సూరిశెట్టి నారాయణ స్వామి, కండే శ్రీనివాసులు,కీసరి మధు, నరేంద్ర,తదితరులు కలిశారు.

## పోలేరమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 15**

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో పోలేరమ్మ దేవస్థానంలో భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమను దేవస్థాన ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉదయ్ న్యూస్ ఛానల్ ప్రొప్రైటర్ సురా పరమేశ్వర్ రెడ్డి, పోలేరమ్మ దేవస్థాన అధ్యక్షులు దొడ్డ రవికుమార్, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ దాహంతో అలసిపోయే ప్రజలకు చల్లని మజ్జిగ అందించడం ఒక గొప్ప సేవా కార్యక్రమామని అన్నారు. ప్రయాణికులు, కూలీలు, పాదచారులు దాహం తీర్చుకుని కొంత ఉపశమనం పొందేలా మజ్జిగ పంపిణీ చేయడం సమాజానికి ఉపయోగకరమైన సేవ అన్నారు.పర్యావరణ పరిరక్షణ - కవర్లు కాకుండా సంచులు వాడండి పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి తడికమల్ల శ్రీనివాసులు ,చైర్మన్ గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శి అనుముల ఆంజనేయులు, ఇమ్మడిశెట్టి వీరారావు, గోరంట్ల చిన్న వెంకట్రెడ్డి, కలవ భాస్కర్, బచ్చు సుబ్రమణ్యం, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, చంద్ర శేఖర్, మానవత సేవా సంస్థ సభ్యులు దేవస్థాన సిబ్బంది పాలుగున్నారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణకు ఆహ్వానం

**కందుకూరు ఎన్టీఆర్ మార్చి 15**

సోమవారం అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆదిత్య, రవి కోల్డ్ స్టోరేజీల, ఆదిత్య చిల్లీ పౌడర్ ఇండస్ట్రియల్, ఆదిత్య అగ్రి ఎక్స్పోర్ట్స్ యజమాని కొంజేటి రవికుమార్‌ని కందుకూరు ఆర్యవైశ్యులు ఆహ్వానించారు.



# గ్రామ సచివాలయాల పరిధిలో అక్షర ఆంధ్ర వయోజనులకు పరీక్షలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**

రాష్ట్ర ప్రభుత్వం అక్షరాస్యత పెంపొందించేందుకు చేపట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమానికి మండలంలో విశేష స్పందన లభించింది. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆదివారం వయోజనులకు అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను వెలుగు సీసీల పర్యవేక్షణలో నిర్వహించగా, వివోఏలు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీలు మాట్లాడుతూ ప్రభుత్వం వయోజనుల్లో అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఫలితాలను ఇస్తోందని, విద్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వయోజనుల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.మండలంలో డిఆర్డిఏ పరిధిలోని వెలుగు మహిళలు 1859 మంది పరీక్షలకు హాజరుకాగా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తరపున 269 మంది పురుషులు పాల్గొన్నారు. మొత్తంగా 2155 మంది వయోజనులు పరీక్షలు రాయడం ప్రభుత్వ కార్యక్రమం పట్ల ప్రజల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమని అన్నారు పరీక్షలను మొత్తం 150 మార్కులకు నిర్వహించగా రాయడం 50 మార్కులు, చదవడం 50 మార్కులు, గణితం 50 మార్కులకు పరీక్షలు



నిర్వహించినట్లు, ప్రతి విభాగంలో 17 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణతగా పరిగణిస్తారని తెలిపారు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించగా, పరీక్షలు రాయడానికి వచ్చినవారికి వీలును బట్టి ప్రతి రెండు గంటలకు ఒకసారి పరీక్ష రాసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు విద్య అందరికీ అందాలనే లక్ష్యంతో రాష్ట్ర



ప్రభుత్వం చేపట్టిన అక్షరాంధ్ర కార్యక్రమం వయోజనలో చదువుపై ఆసక్తి పెంచుతూ అత్యవసర స్థాయిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు టి కాశయ్య, ఐ మస్తాన్ రెడ్డి, యం వి నారాయణమ్మ, విఓఏలు, వయోజనలు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు నియోజకవర్గంలోని 64 మందికి రూ. 30,80,891/- రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పంపినిచేశారు గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న 64 మందికీ 17 వ విడతగా మంజూరు అయిన, రూ,3080891 /- లు ముఖ్యమంత్రి సహాయ నిధి, చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది ఒక ఆపన్న హస్తం అని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం పట్టణాల్లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో పేదవారు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని, వారికీ అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పొందవచ్చునన్నారు.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేకమంది పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికీ అండగా నిలవాలన్నదే చంద్రన్న కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 1009 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 8,41,76,262 /-లు అందచేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం సహాయనిధి పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యే ని శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు పట్టణ కౌన్సిలర్ లు వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితుడికి ప్రెస్ క్లబ్ అసోసియేషన్ చేయూత

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 15**

అందరికి సుపరిచితుడు అయిన గాలెయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం తమ వంతుగా చేయూతఅందించారు.పట్టణంలోని ఓ రెస్టారెంట్ లొ దినసరి కూలిగా జీవితం కొనసాగిస్తున్న గాలెయ్యకు క్యాన్సర్ మహమ్మారి రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దింతో కుటుంబ పోషణతో పాటు వైద్య ఖర్చులు ఆర్థిక భారంగా మారింది. విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ అసోసియేషన్ సీనియర్ జర్నలిస్టులు గాలెయ్య కుటుంబానికి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు.ఈ సందర్బంగా అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల కోటయ్య, షేక్ రియాజ్ లు మాట్లాడుతు నిత్యం వార్తల సేకరణలో వర్కింగ్ జర్నలిస్టులుగా కొనసాగుతున్న పాత్రికేయులు సమాజంలోని ప్రజల సాధక బాధలను, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం సహజమని, అనారోగ్యపరంగా బాధ పడే వారిని, అభాగ్యులను సేవా దృక్పథంతో ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలొ గౌరవసలహా దారులు సయ్యద్ షాబీర్ హుస్సేన్,ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్, సహాయకార్యదర్శులు చేకూరి చంద్రశేఖర్, బొర్రారెడ్డి కె, లాలు,



కోశాధికారి పొట్టి రవి కుమార్, మీడియా ఇంచార్జి ఉప్పలపాటి రమేష్, షమిఉల్లా పాత్రికేయులు పాల్గొన్నారు.

# పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి

**ఎంఇఓలు హరేరామ్, గోవర్ధన్.**

**8 పాఠశాలలు, 280 మంది హాజరు.**

**గుడ్లూరు హైస్కూల్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు.**




**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 15**

నేడు (16వ తేదీ) నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు గుడ్లూరు మండలంలోని మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడ్లూరు నందు పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కేంద్రం ఏర్పాటు చేయబడినదని, ఈ పరీక్షా కేంద్రం నందు విద్యార్థులకు సౌకర్యవంతంగా ఎగ్జామ్స్ రాయడానికి కావాల్సిన బెంచీలు, కుర్చీలు, మంచినీటి వసతి, మెడికల్ క్యాంపు తదితరు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు బీ.హరే రామ్, ఎం.గోవర్ధన్ లు ఆదివారం తెలియజేశారు. ఇందులో మొత్తం ఎనిమిది పాఠశాలల నుంచి 280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇందులో నాలుగు జిల్లా పరిషత్ హైస్కూల్స్,ఒక కేజీబీవీ మరియు మూడు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇప్పటికే ఇన్విజిలేషన్ డ్యూటీస్ అలాట్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వబడ్డాయని వారు తెలిపారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేయబడ్డాయని, పరీక్షా కేంద్రం చుట్టూ ఎలాంటి ఇబ్బంది లేకుండా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కావున విద్యార్థులు మరియు తల్లిదండ్రులు గమనించగలరని ఎంఇఓ లు కోరారు.

# పదిలో పదిలంగా పరీక్షలు వ్రాయండి

## జన విజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి పి.స్వరూప రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**



నేటి నుండి(మర్చి 16నుండి) ఆంధ్రప్రదేశ్ లో, పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు ఆల్ ద బెస్ట్.తెలిపారు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు స్వరూపరెడ్డి . జనవిజ్ఞానవేధిక అద్వర్యం లో టెన్త్ పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ,తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తల్లి దండ్రులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తల్లి దండ్రులకు, పరీక్షలు జరుగుతున్న రోజుల్లో మామూలు రోజుల కంటే, ఇంకొంచం ఎక్కువ సమయాన్ని పిల్లలకు కేటాయించేయాలన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోంటూ. మీరు కూడా కొద్ది రోజులు టీవీలకు దూరంగా ఉందాలని తల్లిదండ్రులకు తెలిపారు.ఉపాధ్యాయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, పిల్లలకు సహకరించాలని.మార్కుల విషయంలోపిల్లలపై ఒత్తిడి పెట్టవద్దన్నారు. మనపిల్లలను ఇతరులతో పోల్చవద్దన్నారు.రోజు వారీ పరీక్షల మాదిరిగా నే ఎటువంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండి, ప్రశాంతంగా వ్రాయాలని ప్రతి ప్రశ్నకు జవాబువ్రాయలన్నారు పరీక్ష వ్రాయక ముందు ఒకసారి ప్రశ్నపత్రాన్నిపూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలని, ఏ ప్రశ్న అయితే వ్రాస్తున్నామో ముందు ఆ ప్రశ్న నంబర్ వేసి జవాబు వ్రాయడం ప్రారంభించాలన్నారు. పరీక్ష వ్రాసేటప్పుడు లోన గాని బయట గాని దురుసుగా ప్రవర్తించవద్దని ఏ రోజు అయితే ఏ పరీక్ష జరుగుతుందో అంతకు ముందు రోజే ఓవర్ అల్ గా ఆ సబ్జెక్ట్ నంతా రివిజన్ చేయాలనిపేర్కొన్నారు. ఒక్కసారి పరీక్ష రాశాక, దాని గురించి ఎక్కువ గా ఆలోచించక తర్వాత రాయబోయే పరీక్ష పైన దృష్టి పెట్టాలన్నారు. ఈ సమయం మీకు చాలా కీలకమైనదని, టైం వృథా చేయకండి. ఎవరితో గొడవ పెట్టుకోకుండా. పరీక్ష కు వెళ్ళేటప్పుడు హాల్ టికెట్ , వ్రాయడానికి కావాల్సిన మెటీరియల్ అన్ని ముందే సిద్ధం చేసుకుని తీసుకువెళ్లాలన్నారు. పరీక్ష వ్రాసేటప్పుడు కూడా సమయాన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలని పరీక్ష వ్రాసిన తర్వాత కూడా మొదటి ప్రశ్న నుండి చివరి ప్రశ్న వరకూ అన్ని సరిగ్గా వ్రాశామా లేదా చెక్ చేసుకోవాలని తెలిపారు. ఛాయస్ వ్రాయాలనుకుంటే పరీక్ష అంతా వ్రాశామని స్పష్టత వచ్చిన తర్వాతనే చివర్లో లో వ్రాయాలన్నారు. పరీక్ష అన్ని రోజులు చక్కని ఆహార నియమాలు జాగ్రత్తగా పాటించేయాలన్నారు. కొన్ని సులభంగా వచ్చే మార్కులు ఉంటాయని వాటిని ఎట్టి పరిస్థితులలోను వదులు కోవద్దన్నారు.ముందు పరీక్ష పేపర్ క్షుణ్ణంగా చదవాలన్నారు. పరీక్షా కేంద్రానికి త్వరగా చేరుకోవేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో ఏదైనా సమస్య ఎదురైతే, వెంటనే మీ ఉపాధ్యాయ సిబ్బంది దృష్టికి తీసుకొని వెళ్లాలన్నారు.వారి సూచనలని పాటించాలని , ఎండలు ఎక్కువగా ఉన్నాయికాన ఆరోగ్యం జాగ్రత్త గా చూసుకొలని సూచించారు. పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే అని గుర్తు పెట్టుకోవేయాలన్నారు.

# మహిళలు అక్షరాస్యులుగా ఎదగాలి

## పొదిలి వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ



**పొదిలి, పెన్ పవర్, మార్చి 15,**

మహిళలు అక్షరాస్యులుగా ఎదగాలని పొదిలి వెలుగు డిఆర్డిఏ ఏపిఎం గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం నాడు మండలంలోని సచివాలయాల పరిధిలోగల ప్రభుత్వ పాఠశాలలో వయోజన విద్య ఆధ్వర్యంలో అక్షరాంధ్ర పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ పర్యవేక్షించారు. డ్వాక్రా గ్రూపుల్లోని నిరక్షరాశులయిన మహిళలతోపాటు ఉపాధి హామీ పథకంలో నిరక్షరాస్యులైన మహిళా కూలీలకు అక్షరాంధ్ర కార్యక్రమంలో నమోదు చేయడంతో పాటు గంట సేపు చదవడం, రాయడం నేర్పించారు. వారికి సచివాలయాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోపాలకృష్ణ తో పాటు వెలుగు సిసి రాజయ్య, వయోజన విద్య సూపర్వైజర్ వెంకటరెడ్డి, వి ఓ ఏ లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుముల మల్లారెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన

# గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల





**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

కొమరోలు మండలం బాదినేని పల్లె పంచాయితీ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి తండ్రి తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల మల్లారెడ్డి (78) శనివారం రాత్రి మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న మల్లారెడ్డి శనివారం రాత్రి బాదినేనిపల్లిలోని ఆయన నివాస గృహంలో కన్నుమూశారు. దీనితో బాదినేని పల్లె పంచాయతీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి కుటుంబంతోపాటు ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ముత్తుముల ఎల్లారెడ్డి తండ్రి మల్లారెడ్డి మృతి చెందినట్లుగా సమాచారం అందుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి , కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తదితర నేతలు ఆదివారం ఉదయం బాదినేని పల్లె గ్రామానికి వెళ్లి ముత్తుముల ఎల్లారెడ్డిని ఓదార్చి ,మల్లారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ,ఎల్లారెడ్డి కుటుంబం ఈ దుఃఖ సాగరం నుంచి త్వరగా కోలుకోవాలని, వారికి మనోధైర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ,సహకార సంఘం అధ్యక్షులు సంజీవరెడ్డి తదితరులు భగవంతుని ప్రార్థించారు. ఆ కార్యక్రమంలో బాదినేని పల్లె, సూరవారిపల్లె గ్రామపంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కొమరోలు తోపాటు పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన పార్టీ నేతలు ,కార్యకర్తలు పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం మల్లారెడ్డి స్నేహానికి కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించారు.

## నారాయణస్వామి సన్నిధిలో అసిస్టెంట్ కమిషనర్ జె. శ్రీనివాసురావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాన్ని అసిస్టెంట్ కమిషనర్, నెల్లూరు వేణుగోపాలస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె. శ్రీనివాసురావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పంచామృత అభిషేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణలు పూజా కార్యక్రమంలో పాల్గొని దేవస్థానం తరపున జె. శ్రీనివాసురావును శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య గోత్రనామాలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు

### సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**

మండల కేంద్రం సి.ఎస్. పురంలో నేటి నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ టిడిపి నాయకులు, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఒక ముఖ్యమైన దశగా భావించే పదవ తరగతి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని సాధించాలని సూచించారు.పరీక్షల సమయంలో ఎలాంటి భయం, ఆందోళనలకు లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకొని ఆత్మవిశ్వాసంతో ప్రశ్నాపత్రాన్ని జాగ్రత్తగా చదివి సమాధానాలు రాయాలని అన్నారు. చదివిన విషయాలను గుర్తుచేసుకుంటూ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుంటే తప్పకుండా మంచి ఫలితాలు సాధించగలరని, విద్యార్థులు పరీక్షలను ఒక అవకాశంగా తీసుకొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకతను, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహాన్ని గుర్తుంచుకొని కష్టపడి చదివిన విద్యార్థులు మంచి మార్కులు సాధించి తమ పాఠశాలలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వము విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నీ పరీక్ష కేంద్రాలలో తగిన ఏర్పాట్లు చేసి పరీక్షలు సజావు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు పరీక్షలు నిర్వహణలో అధికారులు ఉపాధ్యాయులు సిబ్బంది తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు ప్రతి విద్యార్థి అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత చదువుల్లో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



## నేడు10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శుభాకాంక్షలు

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయాలని సూచించారు. ఇప్పటివరకు సాధించిన జ్ఞానం , చేసిన కృషిపై నమ్మకం ఉంచి, ప్రశాంతంగా పరీక్షలు రాస్తే తప్పకుండా ఉత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు. పరీక్షలకు సమయానికి హాజరై, ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి, సమయపాలన పాటిస్తూ సమాధానాలు రాయాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ధైర్యం నింపుతూ, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. అలాగే పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి, తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , గిద్దలూరు నియోజకవర్గానికి గర్వకారణంగా నిలవాలని ముత్తుముల అశోక్ రెడ్డి ఆకాంక్షించారు.



# అమెరికా వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి- జీ.వెంకటేశ్వర్లు





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 15**

అమెరికా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ, గుడ్లూరులో సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నందువల్ల, భారతదేశంలోని వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన అన్నారు. అమెరికా నుండి దిగుమతి అయ్యే వస్తువులు, జీరో శాతం సుంకాలు, మన దేశం నుండి వస్తువులకు 18 శాతం సుంకాలు విధించడం వలన, మన దేశంలో రైతులు ఉత్పత్తి చేసే పంటల దివాలా తీసి, ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు అన్నారు. మోడీ ప్రభుత్వం ఈ దేశ రైతాంగాన్ని విస్మరించి, మోడీ విధానాలకు మోకరిస్తుందని, ఆదాని కోసమే ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవ చేశారు. వెంటనే అమెరికా వాణిజ్య ఒప్పందాలను రద్దుచేసి, భారతదేశ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన విదేశాంగ విధానాన్ని విస్మరించి, అమెరికాకు వత్తాసు పలకడం, ఇరాన్ పై కయ్యానికి కాలుదువ్వుతుంటే, అమెరికాకు సపోర్ట్ చేయడం సరైనది కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కొట్టే వెంకయ్య, రైతు సంఘం నాయకులు, దామా కృష్ణయ్య, రామాల శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, దాసరి సీతారాం, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సుంకర విజయలక్ష్మి, సిపిఎం నాయకులు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్కేఖాదర్ భాషా, సిఐటియు నాయకులు ఎస్.డి సుభాని, వల్లెపు కొండయ్య, పాకల శ్రీనివాసులు, వీర కృష్ణ, సిపిఎం శాఖా కార్యదర్శి గుత్తి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా సభ్యులు సైనికులుగా పనిచేయాలి

### వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 15**




రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను భహిర్గతం చేస్తూ, వైస్సార్సీపీ ప్రభుత్వంలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా సోషల్ మీడియా సభ్యులు సైనికులుగా పనిచేయాలని,వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులకు నూతన సెల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ప్రచారమాధ్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సోషల్ మీడియాలో వైస్సార్సీపీ చేపట్టిన పార్టీ కార్యక్రమాలను, ప్రస్తుత పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాజానికి తెలిసేలా విస్తృతంగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కపట హామీలు అమలు కానీ తీరును ప్రజలకు తెలుపాలని, వైస్సార్సీపీ బలోపేతం చేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేసేలా సోషల్ మీడియా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలోమండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, దోర్నాల మండల పార్టీ అధ్యక్షులు ఘంట వెంకటరమణారెడ్డి, పెద్దారవీడు, పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులు కృష్ణరెడ్డి, దోమకాయల వెంకటేశ్వర్లు, సింగా ప్రసాద్, రాములునాయక్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుకు అన్ని విధాల సాయం అందించడమే తమ ప్రధాన ధ్యేయం

### పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఇమాంస స్పష్టం

**పొదిలి, పెన్ పవర్, మార్చి 15**



రైతులకు అన్ని విధాల సాయం అందించడమే తమ శాఖ ప్రధాన ధ్యేయమని పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస అన్నారు. ఆదివారం నాడు ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అయిన రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా విధులు నిర్వర్తించడమే మార్కెట్ కమిటీ చైర్మన్ గా తన ప్రధాన బాధ్యతగా ఆయన చెప్పారు. రైతులు పండించిన పంటకు మార్కెట్ యార్డ్ లో సరైన మద్దతు ధర లభించే విధంగా పర్యవేక్షిస్తున్నామని చైర్మన్ ఇమాంస చెప్పారు. దళారుల బెడద నుండి రైతులను కాపాడడంతో పాటు వ్యాపారులతో పారదర్శకమైన కొనుగోళ్లు జరిగే విధంగా తాము గట్టి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే రైతుల ఉత్పత్తుల విక్రయాల్లో ఎటువంటి తూకాల్లో మోసాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ ఇమాంస వివరించారు. అలాగే రైతులకు పంట విక్రయాల విషయంలో రావాల్సిన నగదును సకాలంలో వారికి అందే విధంగా కూడా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటు న్నామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకా లు రైతుల దరిచేరే విధంగా చూస్తున్నామని చెప్పారు. దేశానికి వెన్నుముకగా ఉన్న రైతాంగానికి అన్ని విధాల తోడ్పాటు అందించి, వారు ముందుకు సాగే విధంగా చూడటమే మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా తన ప్రధాన లక్ష్యమని ఇమాంస స్పష్టం చేశారు.

## నారాయణస్వామి దేవస్థానంలో షాపుల లీజు హక్కులకు 17న సీల్డ్ టెండర్- బహిరంగ వేలంపాటలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**


మండల పరిధిలోని మిట్టపాలెం గ్రామంలో వెలసిన శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో షాపుల నిర్వహణకు సంబంధించిన లీజు హక్కుల కోసం ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాటలు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంపాటలో పాల్గొని లీజు హక్కులు దక్కించుకున్న వారు 01-04-2026 నుండి 31-03-2027 వరకు ఒక సంవత్సరము పాటు షాపులను నిర్వహించుకునే హక్కు కలిగి ఉంటారని అన్నారు వేలంపాటలో భాగంగా కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు, పండ్లు-పూలు అమ్ముకునే హక్కుకు రూ.5 లక్షలు డిపాజిట్, ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయ హక్కుకు రూ.3 లక్షలు, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చే లైసెన్స్ హక్కుకు రూ.1 లక్ష, గాజులు అమ్ముకునే హక్కుకు రూ.1 లక్ష, చిల్లర సరుకులు విక్రయించే హక్కుకు రూ.1 లక్ష డిపాజిట్ నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే పడి బియ్యం ప్రోగు చేసుకునే హక్కుకు రూ.50 వేల డిపాజిట్, భక్తుల పాదరక్షలు భద్రపరచే హక్కుకు రూ.5 వేల డిపాజిట్, గోరింటాకు అమ్ముకునే హక్కుకు రూ. 5వేల డిపాజిట్ చెల్లించి పాటలలో పాల్గొనవచ్చని తెలిపారు వేలంపాటలో పాల్గొనదలచిన వారు నిర్ణయించిన డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి పాటల్లో పాల్గొనాలని సూచించారు పూర్తి వివరాల కోసం నారాయణస్వామి దేవస్థానం వద్ద కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

# నేటి నుండి 10వ తరగతి పరీక్షలు

### సి యస్ - డివో లు ప్రశాంత వాతావరణలో పరీక్షలు నిర్వహించాలి

### మండల విద్యాశాఖాధికారి పి.నాగభూషణ్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**



గిద్దలూరు మండలం నందు మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు టెన్త్ రెగ్యులర్ పరీక్షలు 7 సెంటర్లు లో 1179 మంది విద్యార్థిని విద్యార్థులు టెన్త్ ఒపెన్ పరీక్షలు రెండు సెంటర్లు నందు 169 మంది విద్యార్థినీ విద్యార్థుల తో నిర్వహించబడుతున్నాయని ఇన్విజిలేటర్లు, విధుల్లో ఉన్న సిబ్బంది తప్ప ఇతరులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబడరని గిద్దలూరు మండల విద్యాశాఖాధికారి పోలా నాగభూషణ్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష సెంటర్ కు విద్యార్థులు సమయపాలన పాటించి హాజరుకావేయాలన్నారు, మాస్ కాపింగ్, మాల్ ప్రాక్టీసుకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు , పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నారని, సెంటర్ పరిధిలో ఎలాంటి జిరాక్స్ షాపులు పరీక్ష జరుగు సమయంలో తెరవకుడదు అని తెలియ జేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సియస్ , డివోలకు సూచించారు, పరీక్షకు హాజరు అవుతున్న విద్యార్థులకు అల్ ది బెస్ట్ తెలియజేశారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 15**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నారాయణస్వామికి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేసిన తదుపరి దేవస్థానం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో కోవిలంపాడు గ్రామమునకు చెందిన కామాయిపల్లి రామయ్య కుటుంబ సభ్యులు , ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# కోటి రూపాయల నిధులతో డ్రైన్లు, సిసి రోడ్లు

## ఎమ్మెల్యే ముత్తుముల నేడే శంఖుస్థాపన

**గిద్దలూరు, పెన్ పవర్ మార్చి 15**



గిద్దలూరు మున్సిపాలిటి పరిధి లో సోమవారం నాడు కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజి లకు , సి సి రోడ్లకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి భూమి పూజా చేయను న్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. సోమ వారం ఉదయం 09-00 గం"లకు గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోనీ రాచర్ల రోడ్ టీచర్స్ కాలనీ , నల్లబండ బజారు శ్రీరామ్ నగర్ అర్బన్ కాలని సచివాలయాల పరిధి లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేయుటకు ఒక కోటి లక్ష రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమములోఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొంటారని పార్టీ కార్యాలయం తెలిపింది. కార్యక్రమం లో వార్డు కౌన్సిలర్లు కూటమి నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 15**

మండలంలోని పలు పరీక్షా కేంద్రాల్లో నేటి నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి డాంగే షరీఫ్ తెలిపారు.మండల పరిధిలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా,553 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల వారీగా చూస్తే పెదారికట్ల కేంద్రంలో 91 మంది,గొట్లగట్టు కేంద్రంలో 200 మంది,వెలుగొండ కేంద్రంలో 136 మంది,మర్రిపాలెం కేంద్రంలో 126 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు నాలుగు మంది చీఫ్ సూపరింటెండెంట్లు,నాలుగు మంది డిపార్ట్మెంట్ అధికారులు,30 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు అధికారులు తెలిపారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు డాంగే షరీఫ్,బరిగె నరసింహారావు తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు,విద్యుత్,కూర్చునే సదుపాయాలు,భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు చెప్పారు.విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకొని నిబంధనలు పాటిస్తూ పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు.అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అక్షర ఆంధ్ర అభ్యాసకులకు ఫైనల్ పరీక్ష నిర్వహణ



**గిద్దలూరు పెన్ పవర్, మార్చి 15**

వయోజన విద్య, డి.ఆర్.డి.ఎ-వెలుగు ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర కార్యక్రమం అమలు నేపథ్యంలో ఎంపిక చేయబడిన గ్రామాల్లో ఉల్లాస్ పేరిట ఎస్. హెచ్. జి. మహిళలకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. దీనిపై ఆదివారం నాడు రాచర్ల మండలంలోని అభ్యాసకులకు ఫైనల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 1738 మంది పాల్గొన్నారు.వీరిలో ప్రధానంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, వి.బి.జి రామ్ జి పథక మహిళలు ఉన్నారు. ఆకవీడు, జేపీ చెరువు, చోళ్ళవీడు సచివాలయాల పరిధిలో జరిగిన పరీక్షలను వయోజన విద్య, వెలుగు అధికారులు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి. ఎ-వెలుగు ఏ.పీ.ఎం కొత్తిమీర నరేష్, వయోజన విద్య పర్యవేక్షకులు సూరా రవీంద్ర నాథ రెడ్డి,వెలుగు సిసి లు ఎన్. కృష్ణయ్య, పి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లూరులో వయోజనులకు ఫైనల్ పరీక్షలు



**తాళ్లూరు, పెన్ పవర్ మార్చి 15**

సంపూర్ణ అక్షరాస్యత సాధనకోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా వయోజనులకు ఆదివారం ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణపై ఎంపీడీవో అజిత పలువురు అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. పరీక్షల నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వయోజనులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. నియోజకవర్గ పర్యవేక్షులు ఎస్.చౌడిరెడ్డి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, సీసీలు మోహన్, కోటేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**



కొమరోలు మండలంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యాశాఖ అధికారి 2 వెంకటరత్నం తెలిపారు. కొమరోలు మండలం కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలు, సర్వెంట్ హై స్కూల్ ,ఎస్ బి ఎన్ ఆర్ ఎం హై స్కూలు, నరేష్ రెడ్డి హైస్కూలు, రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అల్లినగరంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన 414 మంది టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు వీలుగా కొమరోలు లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వ హైస్కూల్లో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, ఆ కేంద్రంలో 217 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు.కొమరోలు లోని సర్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మరో కేంద్రంలో 194 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఈనెల 16వ తేదీ నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు జరగనున్నట్లుగా ఆయన తెలిపారు. కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ లోని పరీక్ష కేంద్రానికి అదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావును పరీక్షా కేంద్ర చీఫ్ సూపర్డెంట్ గా నియమించగా స్కూల్ అసిస్టెంట్ బి కే శ్రీనివాసులను డిపార్మెంట్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారని ఆయన చెప్పారు. అలాగే సర్వెట్ హై స్కూల్ లోని పరీక్ష కేంద్రానికి ఎడవల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ షేక్షావలి ని చీఫ్ సూపర్డెంట్ గాను, బొడ్డువాని పల్లె స్కూల్ అసిస్టెంట్ నిరంజన్ కుమార్ ను డిపార్మెంట్ల అధికారిగా నియమించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్లోని పరీక్షా కేంద్రంలో 9 గదులు ,సర్వెట్ హైస్కూల్లోని పరీక్షా కేంద్రంలో 9 గదులు ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు ,మెడికల్ క్యాంపు సౌకర్యాలను కల్పించినట్లుగా ఆయన తెలిపారు. విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ 2 వెంకటరత్నం తెలిపారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు




**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

కొమరోలు లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పబ్లి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు. కొమరోలు మండలంలోని పలు హైస్కూలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఒక పరీక్షా కేంద్రం, సర్వెట్ హైస్కూల్లో మరో పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏర్పాటు చేసినట్లుగా ఆయన తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 16వ తేదీ సోమవారం నుండి వచ్చేనెల 1వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు జరగనున్నాయని ఆయన చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేందుకు పరీక్ష కేంద్రాల వెలుపల గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, అంతేకాక 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు .అందువల్ల పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రజలు గుంపులు గుంపులుగా సంచరించకూడదని ,అంతేకాక పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బయట నుంచి కాపీలు అందించే ప్రయత్నం చేసినా, ప్రోత్సహించినా, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు .పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను, ఇంటర్నెట్ సెంటర్లను మూసి ఉంచాలని, అందుకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కేసులను నమోదు చేసి కఠిన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగరాజు హెచ్చరించారు.

# నేటి నుండి ఒంటిపూట బడులు

**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 15**

వేసవి ఎండవేడిమి దృష్ట్యా ప్రభుత్వ ఈ విద్యా సంవత్సరంలో నేటి నుండి అనగా (మార్చి 16వ తేదీ) నుండి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూటబడులను నిర్వహించుటకు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారని ఎంఇఓ లు హారేరాం, గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల నిర్వహిస్తారన్నారు. తదనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపుతారని తెలిపారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్నటువంటి పాఠశాలల్లో పరీక్ష జరిగే రోజు మాత్రమే మధ్యాహ్న భోజనం అందించి 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు స్కూల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తమ పిల్లలను పాఠశాలలకు సకాలంలో హాజరయ్యేలా చూడగలరని గుడ్లూరు మండలం విద్యాశాఖ అధికారులు బీ హరేరామ్, ఎం.గోవర్ధన్ లు తెలియజేశారు.



# టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

## పొదిలి ఆర్టీసీ డిఎం శంకరరావు వెల్లడి

**పొదిలి, పెన్ పవర్, మార్చి 15,**



ఈనెల 16వ తేదీ సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ వి శంకరరావు చెప్పారు. ఈ మేరకు తమ సంస్థ అనుమతిం చడం జరిగిందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఈ ఉచిత బస్సు సౌకర్యం సోమవారం నుండి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఉంటుందన్నారు. పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ సంస్థకు చెందిన పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని, ఇందుకోసం సంబంధిత బస్సు కండక్టర్ కు హాల్ టికెట్ చూపించడం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చని డిపో మేనేజర్ శంకరరావు వివరించారు.

# రంజాన్ పండుగను సంతోషంతో జరుపుకోవాలి

## వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 15**

పవిత్ర రంజాన్ పండుగ మాసంలో భక్తి శ్రద్దలతో ఉపవాసదీక్ష చేపట్టి అల్లా ఆరాధనలో ఉండటం గొప్ప విషయమని, వారి ఫలాలు ఫలించాలని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు.ఆదివారం పట్టణంలోని మూసా మసీదులో స్థానిక పట్టణ మౌలానాలు,మౌజన్ లకు రంజాన్ పండగ సందర్భంగా గౌరవంగా దుస్తులను ఆయన పంపిణి చేసారు.మూసా మసీదులో ఎమ్మెల్యేతో కలిసి మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలొ మౌలానా హీదాయతుల్లా, మౌలానా మహమ్మద్, మొహమ్మద్ జుబేర్, కరీముల్లా,సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ జబివుల్లా, షేక్ మహమ్మద్ ఖాసీం,తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కావాలా... ఫోన్ చేయండి



**ఒంగోలు, పెన్ పవర్ మార్చి 15**

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నేపథ్యంలో గ్యాస్ కొరత దృష్ట్యా సమస్యను పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్యాస్ గోదాంల్లో శనివారం తహసీల్దార్లు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ ఏజన్సీలకు గత వారం రోజులుగా ఆయా కంపెనీల నుంచి వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్ల, చిరు వ్యాపారాల నిర్వాహకులు గృహ వినియోగ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఈ మేరకు అధికారులకు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించారు. మరోపక్క యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇంధన, గ్యాస్ కొరతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తతో ఎక్కువ మంది వినియోగదారులు ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా గ్యాస్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిమితికి మించి బుకింగ్ కాల్స్ పెరగడంతో సర్వర్లోనూ గత నాలుగు రోజులుగా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గ్యాస్కు కొరత ఏర్పడుతుందని భావించిన పలువురు గ్యాస్ ఏజెన్సీ వద్దకు పరుగులు తీస్తున్నారు. సర్వర్ సమస్య కారణంగా ఆన్లైన్ బుకింగ్ సాధ్యపడటం లేదని నిర్వాహకులు సమాధానమివ్వడంతో చేసేదేమీ లేక నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో జిల్లా అధికార యంత్రాంగం గ్యాస్ సరఫరా ప్రక్రియ పర్యవేక్షిస్తూ పంపిణీదారులకు సూచనలిస్తున్నారు. కొన్నిచోట్ల తాత్కాలిక జాప్యం జరిగినా సరిపడా గృహ వినియోగ సిలిండర్ల నిల్వలు ఉన్నందున ఎటువంటి ఇబ్బందుల్లేవని పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

**గ్యాస్ బుకింగ్కు ప్రత్యామ్నాయ నంబర్లు**

వినియోగదారులు ఒకేసారి ఎక్కువగా గ్యాస్ బుకింగ్ చేయడంతో సర్వర్ సమస్య వస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని డీఎస్వో పద్మశ్రీ తెలిపారు. సంబంధిత ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ల ద్వారా కూడా బుకింగ్ చేసుకోవచ్చు. ముందుగా ఆయా కంపెనీల వాట్సాప్ నంబర్లకు హాయ్ అని వాట్సాప్ చేయాలి. ఈ మేరకు నంబర్లను ఆయిల్ కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు.

# రప్పా.. రప్పా మాటకు మెగా బ్రదర్ డైరెక్ట్ పంచ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటమి నుంచి తప్పుల్ని పాఠాలుగా నేర్చుకోవటం అందరూ చేసేదే. కానీ.. తమకు ఎదురైంది ఘోర ఓటమి కాదు.. అందరూ కలిసి కుట్ర పన్నారన్న మైండ్ సెట్ తో ఉంటే..? వైసీపీ అధినేత మొదలు వైసీపీ కార్యకర్త వరకు అందరూ అలాంటి మైండ్ సెట్ లో ఉండటమే ఆసక్తికర అంశం. తమను ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కూటమిగా బరిలోకి దిగటం వల్లే ఓడామని.. అలా జట్టు కట్టిన తర్వాత కూడా ఏదేదో చేశారన్న సందేహాలతో తమ ఓటమికి జస్టిఫికేషన్ ఇచచ్చుకోవటం చూసినప్పుడు వైసీపీ వారి మైండ్ సెట్ కు విస్మయం చెందాల్సిందే.
సాధారణంగా ఎదురుదెబ్బలు తగిలినప్పుడు.. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని.. ఆ తప్పులు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటం కనిపిస్తుంది. కానీ.. వైసీపీ వారి నుంచి అలాంటివి ఆశించలేం. అందుకే.. సినిమాల్లోనే వెగటు కలిగించే రప్పా..రప్పా నరికేస్తామనే హింసాత్మక డైలాగ్ ను మరింత సినిమాటిక్ గా రియల్ లైఫ్ లో పార్టీ నినాదంగా మార్చటానికి మించిన తెగింపు ఇంకేం ఉంటుంది? కార్యకర్త మొదలు చిన్నపాటి నేత అత్యుత్సాహంతో అడుగులు వేస్తున్నప్పుడు.. అతడ్ని సరిదిద్దాల్సిన బాధ్యత పార్టీ ముఖ్యుల మీద ఉంటుంది. వారేమో రప్పా రప్పా నరుకుతామంటే.. అదేం సరిపోతుంది? మరింత మోతాదు పెంచడన్న రీతిలో వైసీపీలోని కొందరు తీరు..ఆ పార్టీపై వ్యతిరేకత భావాన్ని కలిగిస్తుంది. అలాంటి మాటలతో మైలేజీ కంటే డ్యామేజే కలుగుతుందన్న మాట రాజకీయ పార్టీలే కాదు..వివిధ పార్టీ నేతలు మొత్తుకుంటున్నా.. పట్టించుకోకపోవటం కనిపిస్తుంది.తాజాగా మెగా బ్రదర్ కం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కం ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వారు చేస్తున్న రప్పా రప్పా నరుకుతామనే నినాదాలపై స్పందించారు. "రప్పా రప్పా నరుకుతామంటే ఇప్పుడున్న సీట్లు కూడా రావు. 2024 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసేలా వైసీపీ ఎన్నో కుట్రలు చేసింది. మళ్లీ జగన్ కు అవకాశం ఇవ్వకూడదని.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మేం కూటమితో పొత్తు పెట్టుకొని పోటీ చేశాం. మరోసారి వైసీపీకి అవకాశం ఇస్తే.. ప్రజలు ఏపీని విడిచి పెట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుంది" అని పేర్కొన్నారు.రాష్ట్రంలో మరో పదిహేనేళ్లు జనసేన. టీడీపీ.. బీజేపీ ఐక్యత సాగుతుందన్న నాగబాబు.. కూటమి కలిసి ఉన్నంతవరకు వైసీపీ ఆటలు సాగవన్నారు. వైసీపీ బెదిరింపులకు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్న నాగబాబు.. వైసీపీ కార్యకర్తలు.. రప్పా రప్పా నరుకుతామన్న మాటలపై చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మెగా బ్రదర్ చేసిన ఈ వ్యాఖ్యల్ని వైసీపీ అండ్ కో కాస్తంత సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైసీపీ అధినాయకత్వం మరేం చేస్తుందో చూడాలి.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కు డ్రగ్ పాజిటివ్ : ఈగల్ ఎస్పీ గిరిధర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో సంచలనంగా మారిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో తాజాగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు కూడా డ్రగ్స్ పాజిటివ్ అని నిర్ధారణ కావడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ విషయాన్ని ఈగల్ విభాగం ఎస్పీ గిరిధర్ అధికారికంగా వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఆజీజ్‌నగర్ ప్రాంతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో శనివారం రాత్రి అనుమతి లేకుండా భారీ స్థాయిలో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఈగల్ టీమ్, ఎస్‌వోటీ సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి ఫాం హౌస్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకున్న వెంటనే అక్కడ ఉన్నవారు భయంతో గందరగోళానికి గురయ్యారు. ఈ సమయంలో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమీద్ మిశ్రా గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆ తుపాకీ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిదిగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనతో అక్కడ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో ఫాం హౌస్‌లో మొత్తం 11 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఢిల్లీ వ్యాపారి నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి సహా పలువురు వ్యాపారవేత్తలు మరియు ఒక మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్స్ పరీక్షల్లో మొదటగా పైలట్ రోహిత్ రెడ్డి, నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. అయితే శనివారం రాత్రి నిర్వహించిన తొలి పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేష్‌కు నెగిటివ్ వచ్చినప్పటికీ ఆదివారం ఉదయం నిర్వహించిన తదుపరి పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. శరీరంలోని మెటబాలిజం ప్రభావం కారణంగా ఈ మార్పు వచ్చినట్లు ఈగల్ ఎస్పీ గిరిధర్ వివరించారు.
దర్యాప్తులో భాగంగా నిందితులు ఇటీవల సిమ్లా , గోవా పర్యటనలకు వెళ్లిన సమయంలో డ్రగ్స్‌ను సేకరించి తీసుకువచ్చి ఈ పార్టీలో వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఫాం హౌస్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 2 గ్రాముల కొకైన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ నమూనాలను మరింత పరీక్షల కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై పోలీసులు పలు చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఎంతటి పెద్దవారు ఉన్నా సరే ఎంపీలు అయినా మాజీ ఎమ్మెల్యేలు అయినా చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే, సిట్టింగ్ ఎంపీ డ్రగ్స్ కేసులో పట్టుబడటం రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. ఒకవైపు ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుంటే ప్రజాప్రతినిధులే డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న వార్తలు బయటకు రావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాజికంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది.

## ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ.. డ్రగ్స్ కేసులో పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..

**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో వెలుగుచూస్తున్న పరిణామాలు, పోలీసుల దర్యాప్తు తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

**మొయినాబాద్ ఫాంహౌస్‌లో ఏం జరిగింది?**
హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లోని ఒక ఫాంహౌస్‌లో ఇటీవల జరిగిన వీకెండ్ పార్టీపై 'ఈగల్ టీమ్' పోలీసులు మెరుపు దాడులు చేశారు. విలాసవంతమైన పార్టీ జరుగుతుండగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.

**పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న విచారణ**
ఈ కేసులో ప్రధానంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ పార్టీలో ఆయనతో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏపీలోని ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కూడా ఉన్నట్లు తేలింది. వీరంతా డ్రగ్స్ తీసుకున్నట్లు బయటపడటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ**
పోలీసుల దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే దాడుల సమయంలో ఫాంహౌస్‌లో రెండు ఐఫోన్‌లను ధ్వంసం చేయడం. విచారణలో భాగంగా ఆ ఫోన్‌లు పైలెట్ రోహిత్ రెడ్డి , అతని పీఏ శ్రవణ్‌కు చెందినవని పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్‌లను రోహిత్ రెడ్డే స్వయంగా ధ్వంసం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రస్తుతం ఈ ఫోన్‌లలో ఉన్న డేటా, వాట్సాప్ చాట్స్ మరియు డ్రగ్స్ సరఫరాదారుల వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీనికోసం పీఏ శ్రవణ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. అతను వెల్లడించే వివరాలు ఈ కేసులో కీలక మలుపు తిరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**జీవో నంబర్.4 ప్రాధాన్యత.. కౌన్సిలింగ్ వైపు మొగ్గు?**
ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం 'జీవో నంబర్.4'. డ్రగ్స్ కేసుల్లో తొలిసారి పట్టుబడిన వారికి కఠిన చర్యల కంటే కౌన్సిలింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. డ్రగ్స్‌కు బానిసలైన వారిని సంస్కరించే క్రమంలో నేర ప్రవృత్తి లేని వారిని సాధారణ వ్యక్తులుగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఈ కేసులో నిందితులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కావడంతో పోలీసులు చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తారా లేదా జీవో ప్రకారం కౌన్సిలింగ్‌కు పరిమితం చేస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

# ఇరాన్ లో రాజరికం పునరాగమనం? అగ్రరాజ్యం మద్దతుతో రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం పశ్చిమ దేశాల దాడులతో పతనం అంచున ఉందన్న వార్తల నేపథ్యంలో, బహిష్కృత మాజీ యువరాజు రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఇరాన్‌లో ప్రస్తుత పాలన ముగిస్తే, దేశ బాధ్యతలను స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత తన కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించినప్పటికీ, ఇరాన్ ప్రజల సంక్షేమం కోసం తిరిగి రావాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్న పహ్లావీ, ఇప్పుడు ఇరాన్ రాజకీయాల్లోకి అధికారికంగా రీ-ఎంట్రీ ఇవ్వడానికి పావులు కదుపుతున్నారు.



**అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!**
కేవలం అధికారాన్ని ఆశించడమే కాదు.. ఇరాన్‌ను తిరిగి గాడిలో పెట్టడానికి పహ్లావీ ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. దీనికి 'ఇరాన్ ప్రోస్పెరిటీ ప్రాజెక్ట్' అని పేరు పెట్టారు. యుద్ధం, అంతర్జాతీయ ఆంక్షల వల్ల చిన్నాభిన్నమైన దేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడం, దేశంలో శాంతి నెలకొల్పడం, మౌలిక సదుపాయాల మెరుగు ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఇరాన్ వద్ద ఉన్న అపారమైన చమురు సంపదను ప్రజల శ్రేయస్సు కోసం వాడతామని, ఇస్లామిక్ పాలనలో కోల్పోయిన అంతర్జాతీయ గౌరవాన్ని తిరిగి తెస్తానని హామీ ఇస్తున్నారు.

**పహ్లావీ వంశం పతనం!**
రెజా పహ్లావీ ఇరాన్ చివరి రాజు మహ్మద్ రెజా షా పహ్లావీ కుమారుడు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం మొదలై.. భారీ ఎత్తున అల్లర్లు చెలరేగడంతో మహ్మద్ రెజా షా పహ్లావీ తన ప్రాణాలు కాపాడుకోవడానికి అమెరికాకు పారిపోయారు. ఆ తర్వాత అయతుల్లా ఖమేనీ నేతృత్వంలో ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడి, రాజరికాన్ని పూర్తిగా రద్దు చేయడమే కాకుండా పహ్లావీ కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించింది. అప్పటి నుంచి ఈ కుటుంబం విదేశాల్లో ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పుతోంది. ఇప్పుడు యుద్ధ పరిస్థితులు మళ్లీ ఈ రాజవంశానికి కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

**యువత ఆలోచన**
ఇరాన్‌లో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కఠినమైన మతపరమైన నిబంధనల వల్ల విసిగిపోయిన ఒక వర్గం పహ్లావీ కాలం నాటి స్వేచ్ఛాయుత జీవనాన్ని కోరుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం పోరాడుతున్న వారు, పాత రాజరికం కాలంలో ఉన్న సామాజిక స్వేచ్ఛను గుర్తు చేసుకుంటున్నారు. అయితే, మెజారిటీ ప్రజలు మళ్లీ రాజరికానికి మొగ్గు చూపుతారా? లేదా ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుకుంటారా? అనేది సందేహమే. పహ్లావీ మాత్రం తాను కేవలం దేశాన్ని మార్పు వైపు నడిపించే ఒక సంధానకర్తగా ఉంటానని, భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారని చెబుతున్నారు.
రెజా పహ్లావీ రాక ఇరాన్‌లో పెను మార్పులకు దారితీయవచ్చు లేదా మరింత అంతర్యుద్ధానికి దారితీయవచ్చు. అమెరికా మద్దతు ఉన్న పహ్లావీ
అధికారంలోకి వస్తే పశ్చిమ దేశాలతో ఇరాన్ సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. కానీ, 45 ఏళ్ల పాటు ఇరాన్ రాజకీయాల్లో లేని వ్యక్తిని ప్రజలు ఎంత వరకు నమ్ముతారనేది పెద్ద ప్రశ్న. యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్ ఒక కొత్త ప్రజాస్వామ్య దేశంగా మారుతుందా? లేక పహ్లావీ సారథ్యంలో మళ్లీ రాజరికం వైపు వెళ్తుందా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఇరాన్ రాజకీయ చదరంగంలో పహ్లావీ ఇప్పుడు ఒక బలమైన పావుగా మారారు.

# సీబీఐపై వైఎస్ సునీత అసంతృప్తి, వివేకా హత్య కేసుపై సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తుపై వైఎస్ సునీత్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. దర్యాప్తు సంస్థ సీబీఐ బాధ్యతగా వ్యవహరించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా ఏడో వర్ధంతి సందర్భంగా సునీత పులివెందుల వెళ్లారు. ఈ సమయంలో మీడియాతో మాట్లాడుతూ సునీత తీవ్ర ఆరోపణలు చేశారు. హత్యపై ఇప్పటికీ తన అనుమానాలను నివృత్తి చేయలేదని సునీత వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసుపై దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో సునీత వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.హత్య కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నిందితులు చెప్పిన అంశాలనే చెబుతోందని, వారు చెప్పినట్లు నడుచుకుంటోందని సునీత ఆరోపించారు. సీబీఐ లోతుగా దర్యాప్తు చేయలేదని విమర్శించారు. తన తండ్రి హత్య తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజెస్ పై సీబీఐ దృష్టి పెట్టలేదని సునీత పెదవి విరిచారు. ఇంకా ఏమైనా ఆధారాలు ఉంటే ఇవ్వండని అడిగితే, తన వద్ద ఉన్న అదనపు ఆధారాలను సైతం కోర్టుతోపాటు సీబీఐకి సమర్పించినట్లు సునీత తెలిపారు. వివేకా హత్యపై తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డిని విచారించాలని సునీత డిమాండ్ చేశారు.తన తండ్రి హత్య కేసుపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్నానని, అయినా తనకు న్యాయం జరగడం లేదని వైఎస్ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధగా ఉందని, తన పోరాటం ఇంతటితో ఆగదని సునీత వెల్లడించారు. చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. మన దేశంలో వ్యవస్థలన్నీ ఇలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు తర్వాత సునీత వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వివేకా హత్య సమాచారం మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఎలా తెలిసింది? అన్న అంశంపై సునీత స్పష్టత కోరుతున్నారు.అయితే దర్యాప్తు సంస్థ ఆ అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలు చేశామని, దర్యాప్తు ముగిసినట్లేనని సీబీఐ తేల్చిచెబుతోంది. కానీ, సునీత మాత్రం ఇంకా కొందరు నిందితులను గుర్తించాలని, అసలు సూత్రధారులు తప్పించుకున్నారని అంటున్నారు. దీంతో హత్య కేసు విచారణ కూడా ముందుకు సాగడం లేదు. వివేకా హత్య జరిగి నేటి ఏడేళ్లు పూర్తవుతోంది. 2019 మార్చి 15న మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపిన హత్య కేసు ఇప్పటికీ అనేక మలుపులు తిరుగుతోంది.

# క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పాక్ ప్లేయర్ సర్ఫరాజ్ అహ్మద్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. (మార్చి 15) ఈ విషయాన్ని అధికారికంగా అతడు వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న సర్ఫరాజ్ చివరిసారిగా 2023లో టెస్టు మ్యాచ్ ఆడగా, 2021లో వైట్ బాల్ క్రికెట్‌లో చివరి మ్యాచ్ ఆడారు. తన రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా అతడు మాట్లాడుతూ.. పాకిస్థాన్ తరఫున ఆడటం తన జీవితంలో గొప్ప గౌరవమని పేర్కొన్నారు. 2006లో అండర్---19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపినప్పటి నుంచి 2017లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న క్షణం వరకు పాక్ జెర్సీలో గడిపిన ప్రతి క్షణం ప్రత్యేకమైనదే అన్నారు.

నా కెరీర్ మొత్తంలో అండగా నిలిచిన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు కృతజ్ఞతలు అని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అలాగే అన్ని ఫార్మాట్లలో పాకిస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో తన కల నెరవేరినట్టే అన్నారు. ఎప్పుడూ నిర్భయంగా క్రికెట్ ఆడాలని, ఐక్యంగా ఉండే జట్టును నిర్మించాలని ప్రయత్నించాను.. నా కెప్టెన్సీలో బాబర్ ఆజం, ఫఖర్ జమాన్, హసన్ అలీ, షాహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్ వంటి ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లుగా ఎదగడం నాకు గర్వకారణంగా ఉందని ఆయన వెల్లడించారు. 2006లో దేశీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన సర్ఫరాజ్ అహ్మద్, 2007 నవంబర్‌లో జైపూర్ వేదికగా భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేశారు. అనంతరం 2010లో టెస్టు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కూడా తొలి మ్యాచ్ ఆడారు. తన టెస్టు కెరీర్‌లో సర్ఫరాజ్ మొత్తం 3031 పరుగులు చేయగా, వన్డేల్లో 2315 పరుగులు చేశాడు. టీ20ల్లో 42 ఇన్నింగ్స్‌లలో 818 పరుగులు చేశారు. ముఖ్యంగా 2017లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపి చరిత్రలో నిలిచిపోయారు. ఫైనల్లో పాకిస్థాన్ జట్టు భారత్ ని ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే 2019లో

ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచకప్ తర్వాత పాకిస్థాన్ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సర్ఫరాజ్ స్థానం జట్టులో స్థిరంగా తన స్థానాన్ని నిలుపుకోలేకపోయాడు. ఆ టోర్నమెంట్ తర్వాత ఆయన కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. అయితే జూనియర్ క్రికెట్ ఆడే స్థాయిలో కూడా సర్ఫరాజ్ అహ్మద్ అనేక విజయాలు సాధించారు. 2006లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపారు. ఆ ఫైనల్లో భారత్‌పై విజయం సాధించారు. ఆ భారత జట్టులో రోహిత్ శర్మ, ఛటేశ్వర్ పుజారా, రవీంద్ర జడేజా, పీయూష్ చావ్లా వంటి ఆటగాళ్లు సభ్యులుగా ఉన్నారు. కాగా ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం సర్ఫరాజ్ అహ్మద్ త్వరలో పాకిస్థాన్ జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఆయనను ఎంపిక కమిటీలో మిస్బా-ఉల్-హక్ తో పాటు సభ్యుడిగా నియమించారు.

# ఆ ఇద్దరినీ వదిలిపెట్టి కేకేఆర్ పెద్ద తప్పు చేసింది.. ఐపీఎల్ ట్రోఫీ గెలవదని కుంబ్లే జోస్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొద్దీ రోజుల్లో ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన ఆర్సీబీ వర్సెస్ -ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ స్టార్ట్ అవుతుంది. ఇప్పటికే కేకేఆర్ టీమ్ కెప్టెన్ గా ఎవరు ఉంటారనే అంశం వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాలతో జట్టు నుంచి తప్పించి.. అతడి ప్లేస్ లో జింబాబ్వే పేసర్ ముజరబానీని తీసుకుంది. జట్టులోని కీలక ప్లేయర్స్ వేలానికి ముందు రిటైన్ చేసుకోకుండా వదిలి పెట్టింది. కేకేఆర్ తీరుపై భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే రియాక్ట్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్, ఫిల్ సాల్ట్ లని విడిచి పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ పెద్ద తప్పు చేసిందని అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. కీలక ప్లేయర్స్ ని అట్టిపెట్టుకోవడం ఎంత ముఖ్యమన్నది వాళ్లు అర్థం చేసుకుంటే తప్ప ఐపీఎల్ టైటిల్ కి కేకేఆర్ అర్హత సాధించలేదని హెచ్చరించాడు. 2024లో శ్రేయస్ ఆధ్వర్యంలో కోల్‌కతా ట్రోఫీ గెలుచుకుంది. అనంతరం అతడు, సాల్ట్ ఆ జట్టును వదిలి పెట్టారు.. శ్రేయస్ పంజాబ్ జట్టులో జాయిన్ కాగా.. సాల్ట్ ఆర్సీబీలో చేరాడు. దాదాపు దశాబ్దం విరామం తర్వాత గత ఏడాది పంజాబ్ కింగ్స్ ఫైనల్ చేరగా.. ఆర్సీబీ తొలిసారి టైటిల్ ని కైవసం చేసుకుంది.. రెండేళ్ల కింద కేకేఆర్ ఐపీఎల్ కప్ విన్నర్ గా నిలిచింది.. మూడోసారి టైటిల్ ని దక్కించుకున్న కేకేఆర్.. విజయంలో శ్రేయస్, సాల్ట్ కీ రోల్ పోషించారని వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం ఆ ఇద్దరినీ వదిలి పెట్టుకుంది.. సీనియర్ ఆటగాళ్లను అట్టిపెట్టుకునే విషయంలో కోల్‌కతాకి నిలకడ లేదని మాజీ ఆటగాడు అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. శ్రేయస్, సాల్ట్ ను వదులుకోవాలిని కేకేఆర్ నిర్ణయం తప్పని చెప్పారు. అజింక్యా రహానె రూపంలో అనుభవజ్ఞుడైన కెప్టెన్ కేకేఆర్ కి ఉన్నప్పటికీ.. కెప్టెన్ గా అతడు ఇంకా టైటిల్ ని దక్కించుకోలేదని తెలిపాడు. శ్రేయస్ అయ్యర్ నాయకత్వ పటిమపై కుంబ్లే ప్రశంసలు కురిపించాడు.

# న్యూజిలాండ్‌పై అదరగొట్టిన సౌతాఫ్రికా.. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ టూర్ ని సౌతాఫ్రికా ఘనంగా ప్రారంభించింది. మౌంట్ మంగునూయ్ వేదికగా జరిగిన తొలి టీ20లో కివీస్ పై ఏకంగా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గ్రాండ్ విక్టరీ సాధించింది. దీంతో ఐదు మ్యాచుల సిరీస్ లో ప్రోటీస్ 1---0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఐడెన్ మార్క్రమ్, క్వింటన్ డికాక్, కగిసో రబాడ, లుంగి ఎంగిడి లాంటి సీనియర్లు లేనిప్పటికి.. కేశవ్ మహారాజ్ కెప్టెన్సీలో సఫారీ యంగ్ టీమ్ అద్భుతంగా రాణించింది. ఈ మ్యాచులో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 14.3 ఓవర్లలో కేవలం 91 రన్స్ చేసి ఆలౌట్ అయింది. ప్రోటీస్ బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల్లాడారు.

న్యూజిలాండ్ బ్యాటర్లలో నీషమ్(26) ఒక్కడే టాప్ స్కోరర్ గా నిలిచాడు. మిగితా బ్యాటర్లు అందరూ ఘోరంగా విఫలం అయ్యారు. ప్రోటీస్ బౌలర్లలో న్కోబాని మోకోనా 3 వికెట్లు తీసుకోగా, కోయిట్జ్, బార్ట్మన్, కేశవ్ మహారాజ్ తలా రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం 92 పరుగుల లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికా కూడా తీవ్రంగా కష్టపడింది. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. సఫారీలను ముప్పు తిప్పలు పెట్టాడు. ఇక సౌతాఫ్రికా ఓపెనర్ కానర్ ఎస్టరైజెన్(45) అజేయంగా నిలిచి మ్యాచ్ ని కంప్లీంట్ చేశాడు. ఫలితంగా ప్రోటీస్ లక్ష్యాన్ని 16.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్ ని చేధించింది. దీంతో రెండు జట్ల మధ్య రెండో టీ20 హామిల్టన్ వేదికగా మార్చి 17వ తేదీన జరగనుంది.




# ప్రభాస్- హోంబలే డీల్.. ఆ ఇద్దరు డైరెక్టర్స్ ఎవరు?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మధ్య ఇటీవల కుదిరిన భారీ డీల్.. ఇప్పటికే సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరి కాంబినేషన్ లో వచ్చిన సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్ భారీ విజయాన్ని సాధించింది. ఆ సక్సెస్ తో ప్రభాస్- హోంబలే ఫిల్మ్స్ కాంబోపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అంతే కాదు ఆ మూడు సినిమాల డీల్ అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే ఆ డీల్ లో భాగంగా ఇప్పటికే ఒక సినిమా ఫిక్స్ అయింది. అదే సలార్: పార్ట్ 2 శౌర్యంగ పర్వం. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సలార్ ఫస్ట్ పార్ట్.. పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ రెస్పాన్స్ అందుకుంది. యాక్షన్ ఎలిమెంట్స్, స్టోరీ, ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎలివేషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, సలార్ 2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఆ సినిమాను హోంబలే ఫిల్మ్స్ భారీ స్థాయిలో నిర్మించనుంది. అయితే ప్రభాస్ తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా మిగిలిన రెండు సినిమాలు ఏమిటన్నది ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఆ మూవీలు.. ప్రభాస్ ఏ డైరెక్టర్స్ తో చేయనున్నారోనని ఇప్పటికీ క్వశ్చన్ మార్క్. అయితే ఆ రెండు ప్రాజెక్టులు ఇద్దరు యువ దర్శకులతో ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఆ దర్శకుల్లో ఒకరు మలయాళ డైరెక్టర్ దింజిత్ అయ్యథాన్ అని టాక్ వినిపిస్తోంది. ఆయన కిష్కింధ కాండ, ఏకో సినిమాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల దింజిత్ ప్రభాస్ ను కలిసి కథ వినిపించినట్లు తెలుస్తోంది. డార్లింగ్ ఇమేజ్ కు తగ్గట్లు దింజిత్ ఆ స్టోరీ రాసుకున్నారని టాక్. అదే సమయంలో మరో దర్శకుడు కూడా డార్లింగ్ కు ఇటీవల ఓ కథ వినిపించినట్లు సమాచారం. కోలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి ఇటీవల ప్రభాస్ ను కలిసి న ట్లు వార్తలు వినిపిస్తున్నా యి. రాజ్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన అమరన్ మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయన కథపై కూడా ఆసక్తి నెలకొంది. అయితే ఆ రెండు కథలు విన్న ప్రభాస్.. ఇంకా ఫైనల్ డెసిషన్ తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి మధ్య హోంబలే ఫిల్మ్స్ తో ఉన్న మూడు చిత్రాల ఒప్పందం స్పెషల్ ఇంపార్టెన్స్ దక్కించుకుంది. ముఖ్యంగా సలార్ 2 ఇప్పటికే ఖరారవ్వడంతో మిగిలిన రెండు సినిమాలు ఏవో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దింజిత్ అయ్యథాన్, రాజ్ కుమార్ పెరియస్వామి చెప్పిన కథలలో ఏది ఫైనల్ అవుతుందో లేదా మరో కొత్త దర్శకుడితో సినిమా ప్రకటిస్తారా అన్నది త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఆ ప్రాజెక్టులపై చర్చ కొనసాగుతూనే ఉంటుంది.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com